ఎవరికి లేని గౌరవం ఏదైనా నేను కోరుకుంటున్నాను అనుకోండి అది జీవలక్షణం. మీకు ఎవరికి లేనిది నాకు ఉండాలని ఎవడు అనుకుంటున్నాడు? మిధ్యానేను అనుకొంటోంది, జీవలక్షణానికి ఆ మిధ్యానేనే బీజం. దేహంతో తాదాత్మ్యం పొందే తలంపును మొదటి పాపం అని కొంతమంది చెపుతారు. భగవంతుడు ద్వంద్వాలకు అతీతంగా ఉన్నాడు. మనకు ద్వంద్వాలు ఉన్నాయి కాబట్టి మనలాగే ఆయనా ఉన్నాడని అనుకొంటున్నాము. మనకు ఉన్న అర్హతనుబట్టి, యోగ్యతనుబట్టి ఏదైనా వస్తుంది కాని కోరుకోవటం వలన మనకు ఏదీ రాదు. మనకు మోక్షం పొందటానికి తగిన యోగ్యత వచ్చేసింది అనుకోండి, ఆయన స్వరూపాన్ని మనకు ఇవ్వటానికి భగవంతుడు ఒక్క క్షణం కూడా వెయిట్‌చేయడు. మనకు అర్హత, యోగ్యత లేదు అనుకోండి, మనం ఎన్నిసార్లు అడిగినా ఇవ్వడు, మనకు నోరు నొప్పి మిగులుతుంది. మనం నోటితో భగవంతుడు ఉన్నాడని, హృదయంలో భగవంతుడు లేడు అని అనుకొంటున్నాము అనుకోండి, మన బుద్ధిలో దోషం ఉందని అర్థం. మన సాధన కరెక్టుగా ఉంటే, సబ్జక్టు మనకు ప్రోపర్‌గా అర్థమయితే ఏ రకమైన ప్రారబ్దం మనలను అంటదు, ముట్టదు. మన ప్రారబ్దాన్ని బట్టి భగవంతుడు మనలను ఆడిస్తున్నాడు. ప్రారబ్దాన్ని నేను అనుభవిస్తున్నాను అనే తలంపును నువ్వు దాటి వెళ్ళిపోయావు అనుకో ఇంక ఆయన చేతిలో ఏమి ఉంది? ప్రారబ్దం అంటే ఏమిటి? నువ్వు గతజన్మలలో చేసింది నీకు వస్తుంది. అప్పుడు చేసింది ఎవరు? మనస్సే చేసింది. ఇప్పుడు అనుభవించేది కూడా మనస్సే. ఆ మనస్సు అనే గడప దాటి వెళ్ళిపోతే ఇంక ప్రారబ్ధం ఏమిటి? మనకు సాధన ఏమీలేదు కాని కోరికలు మాత్రం ఉన్నాయి. ఆ కోరికలు ఫలించినా అది కూడా ప్రకృతే. ఆ ఫలించినది కూడా నీకు ప్రమాదమే, అవి నీ మనస్సులో ముద్రలు వేసి తప్పకొంటాయి, ఆ ముద్రలు మరల కొన్నివేల జన్మలను తీసుకొనివస్తాయి. రాక్షసులు ఎక్కడో ఉన్నారు అనుకొంటున్నాము కాని మనలో ఉన్న వేరుబుద్ధే రాక్షసుడు, ఆ వేరుబుద్ధిలో నుండే రాక్షసలక్షణాలు అన్నీ వస్తున్నాయి. జ్ఞానం గురించి చెప్పేవాడు గురువుకాదు, జ్ఞానాన్ని పంచి ఇచ్చేవాడు గురువు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-07-05, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈరోజు గురుపూర్ణిమ. భారతీయులు చేసుకొనే పండుగలలో గురుపూర్ణిమ ఒకటి. వ్యాసపూర్ణిమనే గురుపూర్ణిమగా మన పెద్దలు ఏర్పాటుచేసారు. విష్ణువుకు నాలుగు చేతులు,

వ్యాసుడికి రెండు చేతులు. చేతులు తేడాగాని ఈయనకూడా నారాయణ స్వరూపుడే అని చెపుతారు. సాహిత్యపరంగా చూసినా, ఆధ్యాత్మికపరంగా చూసినా మన ప్రాచీనులలో వ్యాస మహర్షి, వాల్మీకి మహర్షి, వసిష్ఠ మహర్షి వీరందరు మనం గౌరవింపతగినవారు, పూజింప తగినవారు. మనస్సు ఎన్ని రకాలుగా ఉంటుంది, దాని చేష్టలు ఎలా ఉంటాయి, అది ఎలా ప్రకోపిస్తుంది, సత్వగుణం, రజోగుణం, తమోగుణం ఎలా ఉంటాయో ఇవిఅన్నీ యోగవాసిష్ఠంలో వసిష్ఠుడు రామచంద్రమూర్తికి బోధించాడు. ఇప్పుడు శరీరానికి రోగాలు వస్తే ఎలా వైద్యం చేస్తున్నారో అలాగ మనస్సుకు వచ్చే రోగాలకు వారు కూడా వైద్యం చేస్తున్నారు. మన సాంప్రదాయం మీదగాని, మన ప్రాచీన ఋషులమీదగాని మనకు గౌరవం లేదు. మన సంస్కృతిలో ఏమిఉందో, మన సాహిత్యంలో ఏమిఉందో మనం మర్చిపోయాము, ఎవరినో విదేశీయులను అనుకరించటం మొదలుపెట్టాము. వ్యాసమహర్షి మనకు ఆధ్యాత్మిక ఆచార్యుడు, గురువులకు గురువు, ఈరోజు ఆయన జన్మదినము. మనం కృష్ణాష్టమి ఎలా చేసుకొంటున్నామో, శ్రీరామనవమిఎలా చేసుకొంటున్నామో అలాగ వ్యాసమహర్షి యొక్క పుట్టినరోజును గురుపూర్ణిమగా మనం చేసుకొంటున్నాము. మన మహర్షులు అందరూ బ్రాహ్మణవంశంలో పుట్టినవారు కాదు, వారు అనేక కులాలలో పుట్టినప్పటికీ బ్రాహ్మీస్థితిని పొంది బ్రాహ్మణులు అనిపించుకొన్నారు. వ్యాసుడు భారతదేశానికి ఎంతో సాహిత్యాన్ని అందించాడు. ఆయన ఎక్కువకాలం బదరీలో ఉన్నాడు, కాశీలో కూడా చాలాకాలం ఉన్నాడు, ఆయన పేరుమీద వ్యాసకాశీ ఉంది. గురువు అంటే ఎవరు? నీలోపల ఒక సత్యవస్తువు ఉంది, అదే ఆత్మ, అదే చైతన్యం, అదే నీకు గురువు అని భగవాన్ చెపుతూ ఉండేవారు. జననమరణాలతోగాని, జయాపజయములతోగాని, లాభనష్టములతోగాని ఈ ప్రకృతిలో గాని ఎట్టి సంబంధం లేకుండా ఒక స్వతంత్రమైన వస్తువు నీ హృదయంలో ఉంది, అది సుఖస్వరూపం, శాంతిస్వరూపం, అదే నీకు నిజమైన గురువు. నిజమైన గురువు నీలోపలే ఉన్నాడు. మనకు ఉన్న ధనం వలన గాని, పాండిత్యం వలనగాని, గౌరవం వలనకాని మనస్సుకు లోచూపురాదు. ఒక్క గురువుకు తప్పించి మనస్సు ఎవ్వరికీ జడవదు. మామూలుగా ఏవో పుస్తకాలు చదవటం వలన గురువు యొక్క విలువ తెలియదు, ఆయన యొక్క అనుగ్రహాన్ని పొందినవాడికి మాత్రమే ఆయన యొక్క విలువ తెలుస్తుంది. రమణుడు చెప్పినా, రామకృష్ణుడు చెప్పినా, ఏ మహాత్ముడు చెప్పినా జ్ఞానం గురించే చెపుతారు,

భగవదనుభవం పొందటం గురించే చెపుతారు. గేదెలు, ఆవులు అవి ఎన్ని రంగులలో ఉన్నా పాలు ఒక్కటే, పాలు తెల్లగానే ఉంటాయి, అలాగే గురువులు చెప్పే పద్ధతులలో తేడా ఉండవచ్చు గాని, సబ్జక్టు ఒక్కటే, వారు జ్ఞానం గురించి చెప్తారు. గురువుకి, శిష్యుడికి ఉన్న సంబంధం నోటి మాటలతో చెప్పలేము. మీరు ఏదో మహాత్ముడు యొక్క, ఏదో గురువు యొక్క దయను పొందండి. గురువు యొక్క దయ ఒక్కసారి మీకు కలిగింది అంటే, మన శరీరం పోయినప్పుడు బంధువులతోటి, స్నేహితులతోటి, పరిసరాలతోటి ఉన్న సంబంధం తెగిపోతుంది కాని గురువుతో ఉన్న సంబంధం కంటిన్యూ అవుతుంది. మనం పాలకొల్లులో ట్రైను ఎక్కి కూర్చుంటే ఒక గంట వెనుకో, ముందో అది హైద్రాబాద్ స్టేషన్‌లో పడేస్తుంది, ఏదైనా వర్షాలవలనగాని, ట్రైన్ క్రాసింగ్‌ల వలనగాని దేనివలన అయినా ఒకోసారి లేటు అవ్వవచ్చు అంతేగాని అది మనలను హైద్రాబాద్ చేరుస్తుంది. అలాగే గురువు అనుగ్రహం మీకు కలిగినప్పుడు ఒక జన్మ వెనుకో ముందో మీకు మోక్షం నూటికి నూరుపాళ్ళు వచ్చి తీరుతుంది. ఇందులో సందేహం లేదు. మీ మనస్సు యొక్క స్వభావం ఎలా ఉన్నప్పటికీ, లోకంతో మీకు ఉన్న అనుబంధం ఎలా ఉన్నప్పటికీ ఆ డివైన్‌గ్రేస్ మీకు ఒక్కసారి తగిలిందా మీరు ఏ లోకంలో ఉన్నా, ఏ జన్మలో ఉన్నా ఆ గురువు యొక్క దయ మిమ్మల్ని వెంటాడి మీరు హృదయగుహలో ప్రవేశించే వరకు, మీరు ఏదిగా ఉన్నారో దాని తాలుక అనుభవం మీరు పొందేవరకు అది మిమ్మల్ని విడిచిపెట్టదు, అందులో సందేహం లేదు. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు కాని ఆయన మనకు గోచరించటంలేదు. మనకు లోకంతోటి, జీవకోటితోటి ఉన్న మానసికఅనుబంధాలే మన ఆధ్యాత్మిక అభివృద్ధికి అడ్డువస్తున్నాయి అన్న సంగతి మనం గ్రహించటంలేదు. కొంతసాధనచేస్తేనేగాని అది కూడా మనకు ఎరుకలోనికి రాదు. మన అభివృద్ధిని ఎవరో ఇతరులు ఆపుచేస్తున్నారు అని మనం అనుకొంటున్నాము, అదేమాయ.

మనస్సుకంటే వేరుగా ఏదీ లేదు. ప్రపంచం కూడా మనస్సులోనే ఉంది. మనస్సుకంటే భిన్నంగా ప్రపంచం లేదు. మనస్సు నశిస్తే ఏమీలేదు. మనం ఎన్ని పూజలు చేసినా, జపాలు చేసినా, ధ్యానాలు చేసినా, తపస్సులు చేసినా ఇవి అన్నీ కూడా మనో నాశనానికే. భగవంతుడు ఉన్నాడని కొంతమంది అనవచ్చు, భగవంతుడు లేడని కొంతమంది అనవచ్చు, జీవుడు లేడని ఎవరూ అనరుకదా అన్నారు భగవాన్. నాకు మనస్సు లేదని చెప్పేవారు ఎవరైనా ఉన్నారా?

అందరూ ఉందనే చెపుతారు. మనందరకు నేను అనే స్ఫురణ వస్తోంది. మనకు ఏదైతే నేనుగా స్ఫురిస్తోందో వాడే జీవుడు, వాడు లేడని ఎవరు చెపుతారు. అరుణాచలంలో జ్ఞానం ఉందని, కాశీలో జ్ఞానం ఉందని, వైకుంఠంలో జ్ఞానం ఉందని లేకపోతే పుస్తకాలలో జ్ఞానం ఉందని ఇలా మనం అనుకొంటున్నాము. మనకు నేను అనే స్ఫురణ ఉంది. మనకు వచ్చే సంకల్పాలకు, తలంపులకు, ఆలోచనలకు అన్నింటికీ ఈ నేనే ఆధారం. దీనినే మూలతలంపు అంటారు. ఆ మూలతలంపు మూలంలోనే ఆత్మజ్ఞానం ఉంది. మీరు సాధనచేసి ఏదో పద్ధతి ద్వారా ఆ మూలతలంపు మూలం లోనికి వెళ్ళగలిగితే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. వీరుమంచివారు, వారు చెడ్డవారు, వారు తెల్లగా ఉన్నారు, వీరు నల్లగా ఉన్నారు ఈ ద్వంద్వాల తోటి, ద్వైతాలతోటి లోపల ఉన్న వస్తువుకు ఏమీ సంబంధం లేదు. ఆ వస్తువు ఎలా ఉందో అలా ఉంది, దాని గురించి మీరు ఊహించవద్దు, ఊహించి మీ మనస్సును పాడుచేసుకో వద్దు. ఆ వస్తువును పొందటానికి ప్రయత్నం చెయ్యండి. అయితే మనం చేసే సాధన సిన్సియర్‌గా ఉండాలి, డివోటెడ్‌గా ఉండాలి, డెడికేటెడ్‌గా ఉండాలి. శంకరాచార్యులు, మద్వాచార్యులు, రామానుజాచార్యులు ఈ ముగ్గురు ఆచార్యులు మనం గౌరవింపదగినవారే, పూజింపదగినవారే. లోపల ఉన్న వస్తువులో మనం ఐక్యం అవ్వటానికి శంకరాచార్యులు వారు చెపితే, లోపల ఉన్న పరమాత్మ యొక్క పాదాల దగ్గరకు చేరుకోవటానికి రామానుజులు, మద్వాచార్యులు వారు చెప్పారు. వ్యాసుడు వేదాలను విభజించాడు. వేదాలు ఒక రాశిగా ఉంటే వాటిని విభజించి ఒక క్రమంలో పెట్టాడు. అందరికీ వేదం అర్థంకాదని ఉద్దేశ్యం మీద వేదాలసారం భారతంగా వ్రాసాడు. ఆ మహాభారతంలో విష్ణు సహస్రనామాలు, భగవద్గీత ఉన్నాయి. వేదాలలో ఉన్న సారమే పురాణాలు, ఆ పురాణాలను కథలకింద చెప్పారు. మనం కథ పట్టుకోకూడదు, అందులో ఉన్న పిండిని, సారాన్ని పట్టుకోవాలి, అది మనం నేర్చుకోవాలి. మామూలుగా మానవుడు తన కోర్కెలను తీర్చుకోవటానికి ఈశ్వరుడిని ప్రార్థిస్తాడు. మనకు ఏది ఎప్పుడు అవసరమో భగవంతుడికి తెలుసు. మనం అది కావాలి, ఇది కావాలి అని భగవంతుడిని అడుగుతాము కాని అలా మనం అడగనక్కరలేదు. మనకు ఎప్పుడు ఏది కావాలో అది ఆయన మనకు ఇస్తాడు. అర్హత, యోగ్యత లేనివాడికి డబ్బు ఇస్తే వాడు పాడై పోవచ్చు. మనం సాత్వికంగా ఎలా ప్రవర్తించాలో ముందు గురువు దగ్గర మనం నేర్చుకోవాలి. ఒక పండు మనం ఇతరులకు ఇచ్చేటప్పుడుగాని, ఇతరుల దగ్గర నుండి తీసుకొనేటప్పుడుగాని

సాత్వికపద్ధతిలో ఉండాలి. మనమాట, ప్రవర్తన సాత్వికంగా ఉండాలి. ఎవడైతే సాత్విక పద్ధతిలో జీవిస్తున్నాడో వాడు ఈశ్వరుని దయకు పాత్రుడవుతాడు. మనస్సులో గుణాలు ఉన్నాయి కాని చైతన్యంలో గుణాలు లేవు. సత్వగుణం కూడా ఒక గుణమే, కాని జ్ఞానం దగ్గరకు చేరుకోవటానికి అది మనకు సహాయ సహకారాలు అందిస్తుంది. మనందరము సోమరితనానికి అలవాటు పడ్డాము. మనకు జపం లేదు, ధ్యానం లేదు, విచారణ లేదు, భగవంతుని పాదాలయందు గౌరవం లేదు, అధ్యయనం లేదు. సోమరితనానికి అలవాటు పడిన మనిషి ఈలోకానికి పనికిరాడు, పరలోకానికి పనికిరాడు. మీకు ఇష్టమైన భగవంతుడి నామాన్ని తీసుకొని జపించగా జపించగా, ఆయన రూపాన్ని ధ్యానించగా ధ్యానించగా మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది. మనం జిన్నూరు విడిచిపెట్టి ఇక్కడనుండి అరుణాచలం వెళ్ళిపోవచ్చు కాని మన జీవితాన్ని విడిచిపెట్టి ఎక్కడకు పారిపోతాము. మనం ఎక్కడికి వెళ్ళినా మన కూడా మనస్సు ఉంటుంది, మనస్సును విడిచిపెట్టి ఎక్కడికి పారిపోగలము. అందుచేత మనం జీవించే విధానంలోనే మనోనాశనం అయ్యేటట్లు మనం చూసుకోవాలి. మన జీవితవిధానంలో సత్వగుణాన్ని పెంచుకొంటే మనోనాశనానికి అది సహకరిస్తుంది. మీకు తెలియకుండా ఎప్పుడైనా అశాంతి వస్తోంది అనుకోండి మీలో ఏదో భయం ఉండి ఉంటుంది, ఆ భయం వలననే అశాంతి వస్తుంది. భయం లేకుండా జీవించటం ముందు నేర్చుకోండి. మన గురించి మనం ఆలోచించుకోవటం మానివేసి, మన ఆధ్యాత్మిక అభివృద్ధి గురించి ఆలోచించుకోవటం మానివేసి, మన గురించి వారు ఏమనుకొంటున్నారు, వీరు ఏమనుకొంటున్నారు అని అనుకోవటం వలన జీవలక్షణాలు పెరిగిపోతాయి. దానివలన మనస్సు బాహ్యముఖమవుతుంది గాని మనస్సుకు లోచూపురాదు. మీరు చాలా గొప్పవారు అని బయట వారు అనుకొంటారు అనుకోండి, మీకు శాంతి లేదు అనుకోండి, ఎందుకండి ఆ గొప్పలు. గొప్పల వలన చివరకు మీకు తిప్పలు వస్తాయి. మనం సుఖంగా, శాంతిగా, ఆనందంగా ఉంటే ఎవరు ఏమనుకొన్నా ఏమీ లేదు.

మనకు దైవచింతన తక్కువ, ఆత్మచింతన తక్కువ, విషయచింతన ఎక్కువ, ఇదే మన అశాంతికి కారణం, మన దుఃఖానికి కారణం. విషయచింతన వలన మనస్సు చిక్కబడుతూ ఉంటుంది, మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. మన మనస్సుకు అంతర్ దృష్టిని కలుగుజేసేవాడే నిజమైన గురువు. మన జీవిత విధానంలో మనకు వచ్చే తలంపుల

విషయంలో అజాగ్రత్తగా ఉండకూడదు, మనం చేసే పనుల విషయంలో, మనం మాట్లాడే మాటల విషయంలో అజాగ్రత్తగా ఉండకూడదు, ఏమరపాటు పనికిరాదు. ఎందుచేతనంటే ఒకోసారి మనం మాట్లాడేమాటలే మనకు అశాంతిని తీసుకొని వస్తాయి, మనం చేసే పనులే మనకు అశాంతిని తీసుకొనివస్తాయి. ఎవరితో స్నేహం చేయాలో మనకు తెలియటంలేదు అనుకోండి, ఆవిచక్షణ మనకు లేదు అనుకోండి మనం చేసే స్నేహాల వలననే మనకు అశాంతి వస్తుంది. మనకు ఎంతసేపు కాళ్ళు బాడిచేసుకోవటం, కడుక్కోవటం ఇదే పని ఇంతకన్న వేరేపని మనకులేదు. మీరు సాధనచేయలేకపోతున్నారు అనుకోండి, మీకు పాండిత్యం లేదు అనుకోండి, అధ్యయనం చేయలేకపోతున్నారు అనుకోండి, అవగాహన చేసుకొనే శక్తి మీకు లేదు అనుకోండి, మీ ప్రాంతంలో ఎవరైనా మహర్షులు ఉంటే, ఆత్మజ్ఞాన సంపన్నులు ఉంటే, సత్వగుణమే ధనంగా కలవారు ఉంటే వారి సహవాసం చేసినా మీకు మనోనాశనం కలుగుతుంది. అయితే మన పాపపుబుద్ధి అటువంటి వారితో సహవాసం చెయ్యనివ్వదు. చాలామందికి వారికి ఉన్న డబ్బే వారికి దుఃఖాన్ని తీసుకొనివస్తుంది, అది వారికి తెలియటం లేదు. విశ్లేషణ చేసుకొంటే అది మీకు తెలుస్తుంది. పాండిత్యం, ధనం, గౌరవం ఇవన్నీ కేవలం ప్రకృతికి సంబంధించిన విషయాలు, ఇవి ఊరేగింపులకు పనికి వస్తాయి, అసలు సద్వస్తువుకి వీటిలో ఏమీ సంబంధం లేదు. మనందరిలో ఉన్న బలహీనత ఏమిటి అంటే మనం కర్మకు ఇచ్చే ప్రాముఖ్యత సంకల్పానికి ఇవ్వటంలేదు. ఇక్కడ లక్ష్మిగారు నుయ్యి తవ్వించారు అనుకోండి, మీరు లక్ష్మిగారికి సన్మానం చేద్దాము అనుకొంటారు. భగవంతుడు ఏమి చూస్తాడు అంటే ఆ నుయ్యి తవ్వించేటప్పుడు మీలోపల సంకల్పాన్ని చూస్తాడు, వాడే ఈశ్వరుడు, వాడే గురువు. మనం ఎంతసేపు పైపైన ఈతలు కొట్టటం నేర్చుకొంటున్నాము కాని లోపలకు వెళ్ళటం మనకు చేతకాలేదు. అదే భగవాన్ చెప్పారు. చెరువులో పడిన వస్తువు పైపైన ఈతలు కొట్టేవాడికి దొరకదు, వాడు వాక్కును నిరోధించి, ప్రాణాన్ని నిరోధించి లోపలకు మునిగి ఆ వస్తువు ఎంత లోతులలో ఉందో అంత లోతులలోనికి వెళితే ఆ వస్తువు మనకు దొరుకుతుంది. మనం ఎవరినైనా ద్వేషించాము అనుకోండి, అది మీరు మర్చిపోవచ్చు కాని ఈశ్వరుడు లోపల రికార్డు చేసేస్తాడు. అది లోపల సంస్కారం కింద ఉండిపోతుంది, అదే తలంపు రూపంలో వస్తుంది, అక్కడ నుండి నీకు అనుభవం ప్రారంభమవుతుంది. నీ లోపల ఏ బలహీనతలు ఉన్నాయో వాటిని నీ మెదడుకు చూపించి బయటకు కక్కిస్తూ ఉ

ంటాడు, నువ్వు 10 జన్మలలో అనుభవించవలసిన దానిని ఒక జన్మలోనే పూర్తిచేస్తాడు, వాడు గురువు. నెగిటివ్ తింకింగ్ ఉన్నవారితో మనం అసలు సహవాసం చెయ్యకూడదు. నిడదవోలులో బయలుదేరారు ఒక గంటలో జిన్నూరు వచ్చేస్తారు అని చెపుతారు అనుకోండి కొంతమంది ఏమంటారు అంటే జిన్నూరు వస్తారేమిటి? ఈలోపుగా ఏ మార్టేరులోనో ఏక్సిడెంట్ అవుతుంది అని అంటారు, కొంతమందికి అంత నెగిటివ్‌తింకింగ్ ఉంటుంది. అటువంటివారితో సహవాసం చేసామా మనం భ్రష్టులమయిపోతాము. కొంతమందికి జన్మతః నెగిటివ్‌తింకింగ్ ఉంటుంది, వారు సుఖంగా ఉండరు, ఇతరులను సుఖంగా ఉండనివ్వరు. కొంతమంది అక్కడ మాటలు ఇక్కడ, ఇక్కడ మాటలు అక్కడ చెపుతారు ఎందుకు అంటే పేచీలకోసం చెపుతారు, వారికి సత్వగుణం ఉండదు, వారు జీవితంలో ఏమీ బాగుపడరు, మిమ్మల్ని బాగుపడనివ్వరు. ఈ ఆధ్యాత్మిక జీవితంలోనికి వచ్చినవాడు చాలా కేర్‌ఫుల్‌గా ఉండాలి. గురువు ఒకోసారి కోపం నటిస్తాడు, ఒకోసారి కరుణ చూపిస్తాడు. గురువుగారు మనతో చాలా ప్రేమగా మాట్లాడారు అనుకొంటాము, ఒకోసారి గురువుగారు కోపంగా మాట్లాడారు అనుకొంటాము, అలా కోపంగా మాట్లాడటం కూడా దయే అని గ్రహించినవాడు ధన్యుడు. గురువు నీలో అంతర్యామిగా ఉన్నాడు, నీ ఆలోచనలు అన్నీ చూస్తూ ఉంటాడు, నిన్ను పక్వదశకు తీసుకొని వస్తాడు. గురువుకంటే మనలను ప్రేమించే వాడు ఇంకొకడు ఉండడు, ఉన్నాడేమో అని మనం అనుకొంటాము. అలా అనుకొనేది కూడా మనస్సే. దక్షిణామూర్తి బోధ అంతా మౌనంగానే చెప్పాడు. ఆత్మ యొక్క భాష మౌనమే. లోపల మెచ్యూరిటీ ఉన్నవారు, పక్వదశకు వచ్చినవారు ఆ మౌన భాషను అందుకొంటారు, వారికి మాటలతో పనిలేదు. ఒకసారి భగవాన్ కొండమీద నుండి వస్తున్నారు. భగవాన్ వచ్చే మార్గంలో చలంగారు అడ్డుగా నుంచున్నారు. చలంగారు నాస్తికుడు. వాడూ మనిషే, నేనూ మనిషే ఎందుకు ప్రక్కకు తప్పకోవాలి అని తప్పకోలేదు. అప్పడు భగవాన్ ప్రక్కకు తప్పకొని నాలుగు అడుగులు ముందుకు వేసి వెనక్కి తిరిగి చూసారు అంతే చలంగారి పని అయిపోయింది. భగవంతుడిని మనం తలపెట్టుకోవటం వేరు, మనలను ఎప్పడైనా భగవంతుడు తలపెట్టుకొన్నాడు అనుకోండి మన పని పూర్తి అయిపోతుంది. చలంగారికి ఆత్మబోధ లేదు, జ్ఞాన బోధలేదు, ఆయన పని పూర్తి అయిపోయింది.

మామిడిపండు భగవంతుడు అనుకోండి, ఆ మామిడిపండులో ఉన్నరసం గురువు.

గురువు భగవంతుడిలాగ జడ్జిమెంట్ వ్రాయడు, ఆయన ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని పొందింప చేయటానికి చూస్తాడు. చనిపోవటంలో ఉన్న అల్పత్వం, పుట్టుకలో ఉన్న అల్పత్వం, విషయాలలో ఉన్న అల్పత్వం, భోగాలలో ఉన్న అల్పత్వం అంతా నీ కళ్ళకు కనిపించేలా ఎత్తి చూపిస్తాడు, వాడు గురువు. అందులో ఏమీలేదు అన్న నిస్సారత నీ బుద్ధికి అందేలా చేస్తాడు, వాడు గురువు. నీ రైట్‌తింకింగ్, రాంగ్‌తింకింగ్ గురువుకు అక్కరలేదు, మార్కులు వేస్తాడు కాబట్టి వాటిని దేవుడు చూసుకోవచ్చు కాని గురువు అవి ఏమీచూడడు. అక్కడ టెంక, పీచు, తొక్క ఉండవచ్చు కాని గురువు అంటే రసమే, ఇది గొంతుకకు అడ్డుపడదు, దానిని మింగేయటమే. మీరు ఎన్ని సాధనలు చేసిన గురువు యొక్క దయలేకుండా మనస్సు అంతర్ముఖం అవ్వదు. కృష్ణుడి చరిత్ర చూడండి. ఆయన ఎవరినైనా చంపాలను కుంటే వారిని ఇలా ముట్టుకొంటే చాలు, వాడు చనిపోతాడు, అంటే వెయ్యి ఏనుగుల బలం వచ్చి ఒకేసారి మీదపడినట్లుగా ఉంటుంది, అది మన కళ్ళకు కనబడదు, వాడు ఎంతటి బలవంతుడు అయినా చనిపోతాడు. గురువు అనుగ్రహం అటువంటిదే. గురువు అనుగ్రహం ఎలా పనిచేస్తుందో మనకు కనబడదు, మనకు వినబడదు, సైలెంట్‌గా పని అయిపోతూ ఉంటుంది. మీకు బ్రహ్మానుభవం కలిగింది అనుకోండి, తెలియక అనవసరంగా ఇంత దుఃఖ పడ్డాను అని అప్పడు మీకు అనిపిస్తుంది, మిమ్మల్ని చూసి మీకే ఆశ్చర్యం కలుగుతుంది. మనలను ఏ స్థితికి తీసుకొని పోవాలనుకొన్నాడో అక్కడకు మన జీవితాలను మలుపు త్రిప్పకొంటూ దొర్లించుకొంటూ తీసుకొనిపోతాడు, వాడు గురువు. దానిని మనం మాటలతో చెప్పలేము, మనస్సుతో ఊహించలేము. గురువుకు రక్షించటమే పనికాని శిక్షించటం ఉండదు. ఒకవేళ శిక్షించినట్లుగా అనిపించినప్పటికీ అది కూడా రక్షించటమే. నువ్వు ఏదిగా ఉన్నావో దాని గురించి గురువు నీకు బోధిస్తాడు, బోధించటమేకాదు ఆ స్థితిని నీకు అనుగ్రహిస్తాడు, లోపల ఉన్న స్వీట్‌నెస్‌ను నీకు తెలియపరుస్తూ నిన్ను అక్కడకు గెంటుకుంటూ, నెట్టుకుంటూ వెళ్ళిపోతాడు, ఆ ప్రక్రియలో నీకు బాధ లేకుండా చేస్తాడు, వాడు గురువు. మీరు ఎలా ఉన్నారు? బాగున్నారా? మీరు భోజనం చేసారా? అని అడుగుతాడు. మీ మనస్సును నిర్మలంచేయటానికి, నీలోపల ఉన్న శాంతిని నీకు అందింప జేయటానికి ఏదో వంపు పెట్టుకొని నీతో మాట్లాడతాడు, వాడు చేసే పని మాత్రం నీకు తెలియనివ్వడు, వాడు గురువు. మనం గుర్తింపులకోసం పనిచేస్తాము, దాని వలన మనస్సు

పెరిగిపోతుంది. గురువు ఏ పనిచేసినా గుర్తింపుకోసం చేయడు ఎందుకంటే వాడికి ఇతరులు లేరు. చైతన్యానికి ఇతరులు లేరు. మనలను మనం దేహంగా చూసుకొంటున్నాము కాబట్టి ఇతరులను కూడా దేహాలు అనుకొంటున్నాము. గురువు అంటే చైతన్యమే. ఆయన మనలో కూడా చైతన్యాన్నే చూస్తాడు అందుచేత ఆయనకు ఇతరులు లేరు. నీ హృదయంలో ఉన్న చైతన్యం నీకు అనుభవంలోనికి వచ్చాక లోకం కూడా చైతన్యంగానే కనబడుతుంది. గురువు నీకు బోధిస్తూ ఉంటాడు, నీతో కలిసి తిరుగుతూ ఉంటాడు, అలా ఉంటూ నీ మనస్సును నిర్మలం చేస్తాడు, నిశ్చలం చేస్తాడు. ఏదైతే సత్యమో అది నీ హృదయంలోనే ఉంది, కాని అది నీకు అందటం లేదు, దానిని నీకు అందింపచేయటానికే ఈ పనులన్నీ గురువు చేస్తూ ఉంటాడు. నరసింహమెహతా కృష్ణభక్తుడు, నరసింహమెహతా వ్రాసిన పాట గాంధీగారు రోజూ పాడుకొనేవారు. ఏవో కొన్ని కారణాల వలన మెహతాకు ఆయన కుటుంబసభ్యులు అందరూ శత్రువులైపోయారు. మనందరము వెలివేసాము అయినా వీడు సుఖంగా ఉన్నాడు ఏమిటి? అని వారు అనుకొనేవారు. ఆయన సుఖం కోసం ఎవరిమీద అయినా ఆధారపడితే కదా, ఆయన భగవంతుడిలో ఉన్నాడు, ఆయన స్వతంత్రమైన సుఖి. నేను చదివిన చదువు, సాహిత్యం మరిచిపోయినా నరసింహమెహతా వ్రాసిన వైష్ణవ జనతాపాట నాకు చాలు అనేవారు గాంధీగారు, ఆ పాటలో భక్తుడి లక్షణాలను నరసింహమెహతా చెప్పాడు. నీ మనస్సును అంతర్ముఖం చెయ్యటానికి గురువు నీతో స్నేహం చేస్తాడు. నీకు జపం పట్ల, ధ్యానం పట్ల ప్రీతి కలుగజేస్తాడు. నీకు ప్రీతి కలుగజేసేవాడు ఆయనే, అనుభవాన్ని కలుగజేసేవాడు ఆయనే, ఇంక నువ్వు ఎక్కడ ఉన్నావు, నేను ఏదో చేసాను అనుకొంటున్నావు ఏమీ లేదు సున్నా. బయటఉన్న ఆకర్షణలకు మనం లోనుకాకుండా, లోకంలో ఉన్న ప్రలోభాలకు మనం లోనుకాకుండా ఉంటే మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. మూలతలంపు యొక్క మూలం మాంసంతో తయారైన ఫిజికల్‌హార్ట్ కాదు. నేను అనే స్ఫురణ ఎక్కడనుండి వస్తోంది అంటే ఆధ్యాత్మిక హృదయంలోనుండి వస్తోంది, భగవంతుడు అక్కడే ఉన్నాడు. మీ మనస్సు చాలా గొప్పగా ఉందని మీరు అనుకొంటారు, గురువు ఎక్కడ సహాయం చేస్తాడు అంటే నీ మనస్సులో ఉన్న నిస్సారతను నీకు తెలియజేస్తాడు.

భగవంతుడికి కళ్ళులేవు కదా చూడటం లేదు అని అనుకోవద్దు. ఆయన కళ్ళు

లేకుండా చూడగలడు, చేతులు లేకుండా పని చేయగలడు. భగవంతుడికి అసలు రూపం అక్కరలేదు. భక్తుడికి తగిన మెచ్యూరిటీ ఉంటే అసలు రూపం కూడా ధరించకుండా అనుగ్రహించి మోక్షాన్ని ఇస్తాడు. కాని మనకు ఆ మెచ్యూరిటీ లేకపోవటం వలన రూపం ధరించవలసి వస్తోంది. మీకు ఎప్పుడైనా కష్టం వస్తూ ఉంటుంది, సుఖం వస్తూ ఉంటుంది, ఇవి అన్నీ మీరు ట్రైనింగ్ అవ్వటానికి వస్తున్నాయి. మీకు లోచూపు ఉంటే అది మీకు తెలుస్తూ ఉంటుంది. లక్ష్మిగారితో మీరు స్నేహం చేస్తున్నారు అనుకోండి, సడన్‌గా లక్ష్మిగారు మీతో మాట్లాడటం మానివేస్తే మీరు డిస్ట్రబ్ అయిపోతారు, తలపోటు వచ్చేస్తుంది, బిళ్ళలు వేసుకొంటారు, అంటే మీకు లోచూపు లేదని అర్థం. లక్ష్మిగారు మాట్లాడితే ఏమిటి? మాట్లాడకపోతే ఏమిటి? అనే వివేకం మీకు వచ్చేసింది అనుకోండి ఇంక మీకు ఏమీ అనిపించదు. మీ అత్తగారు సడన్‌గా మీతో మాట్లాడటం మానివేసారు అనుకోండి, మీరు డిస్ట్రబ్ అయిపోతారు, పూజ జపం ధ్యానం అన్నీ పోతాయి, అశాంతి వచ్చేస్తుంది, ఇంక మీకు ఆధ్యాత్మిక అభివృద్ధి ఏమిటి? మీ ఇంట్లోవారు మీతో తక్కువగా మాట్లాడుతున్నారు అనుకోండి మీకు వచ్చిన నష్టం ఏమిటి? అది మీకు ప్లస్ పాయింటేగాని మైనస్ పాయింట్‌కాదు, దాని వలన మీకు గోలతగ్గిపోతుంది, ఏకాంతవాసం కుదురుతుంది, హాయిగా సాధన చేసుకోవచ్చు, ఒకవేళ వారు మాట్లాడినా నిన్ను అవిద్యవైపుకు తీసుకొని వెళతారు, ఎంజాయ్‌మెంట్ వైపుకు తీసుకొనివెళతారు కాని పెర్‌ఫెక్షన్ వైపుకు తీసుకొని వెళ్ళరు. నీకు నారాయణ స్మరణ లేదు అనుకో, నీ నాలుక ఎప్పుడూ భగవంతుడి నామాన్ని ఉచ్ఛరించటం లేదు అనుకో పుట్టలో ఉన్న పాముకి నీ నోటిలో ఉన్న నాలుకకు తేడా ఏమీలేదు అన్నాడు వేమన. ఒక మహాజ్ఞాని దగ్గర మనం కూర్చొన్నాము అనుకోండి, వారి తాలుకా శాంతి, సుఖం, ఆ వైబ్రేషన్స్ మన మీద పడతాయి, మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా వాటిని అనుభవించకుండా ఉండలేము. కొండమీద ఉన్న దీపాన్ని చూడకుండా ఎంతమందిని ఆపుచెయ్యగలం అంటాడు ఏసు. మోక్షం, శాంతి, జ్ఞానం నీ హృదయంలోనే ఉంది కాని అది భౌతికం కాదు, అది ముందు నీకు అర్థం అవ్వాలి. ఎందుచేతనంటే మన దృష్టి 100% భౌతికదృష్టి, కళ్ళకు కనిపించేదే నిజం అనుకొంటున్నాము. నిర్వాణసుఖం నీ హృదయంలోనే ఉంది, అది స్వతంత్రమైన సుఖం. అది మామిడిపండు తిన్నట్లుగా ఉంటుంది, సినిమాచూసినట్లుగా ఉంటుంది అనుకొంటున్నావేమో అలా ఊహించుకోవద్దు, అది భౌతికంకాదు, అది అనుభవైకవేద్యం.

మీరు ఊహించినదానికంటే చాలాగొప్పగా ఉంటుంది అందుచేత ఊహించవద్దు అని చెపుతున్నారు. శరీరం ఉంటే ఇంద్రియాలు ఉంటాయి, ఆ ఇంద్రియాలతో కొన్ని సుఖాలు అనుభవిస్తాము, మోక్షం కూడా ఆ సుఖంలాగా ఉంటుందని అనుకోవద్దు, మనం ప్రమాదంలో పడకుండా ఉండటంకోసం, ముందు జాగ్రత్తకోసం చెపుతున్నారు. మీరు ఎంత పండితుడు అయినప్పటికీ, మీకు ఎంతధనం ఉన్నప్పటికీ, మీకు ఎంత శక్తి ఉన్నప్పటికీ, భవిష్యత్తులో ఏమి జరుగుతుందో చెప్పగలశక్తి మీకు ఉన్నప్పటికీ, ఇటువంటి శక్తులు ఎన్ని ఉన్నప్పటికీ గురువు యొక్క దయ లేకపోతే నీకు ఆత్మజ్ఞానం కలుగదు. మీరు ఒకటి బాగా గుర్తుపెట్టుకోవాలి. మన హృదయంలో ఉన్న సత్యవస్తువును కాదని మాటలద్వారా, చేతలద్వారా, ఊహలద్వారా ఇలా ఏవో కల్పించుకొని వెళ్ళిపోతాము అనుకోండి మరల అనేక వేల జన్మలు ఎత్తితేగాని వెనక్కిరాలేము, ఇది గుర్తుపెట్టుకోండి. మనం ఈ జన్మలో ద్వేషబుద్ధి నేర్చుకొంటే, మరల కొన్ని జన్మలు సాధన చేస్తేగాని అందులోనుండి బయటకు రాలేము. బుద్ధుడు ఏమి చెప్పాడు అంటే నీకు కాలు జారటానికి పెద్ద పెద్ద రాళ్ళు అక్కరలేదు, చిన్నరాయి చాలు అన్నాడు. అంటే ప్రకృతి వైపుకు రావటానికి చిన్న బలహీనత చాలు, లోకానికి సంబంధించిన చిన్న ఆకర్షణ చాలు. ఓడ చాలా పెద్దదిగా ఉంటుంది. దానికి కింద చిన్న చిల్లు పడింది అనుకోండి, మనం దానిని చూసుకోము అనుకోండి, ఓడ అంతా మునిగిపోతుంది, ఓడలోని వారందరూ మునిగిపోతారు. అలాగే నీవు పాడైపోవటానికి ఒక్క బలహీనత చాలు. మనకు భగవంతుడు చెప్పిన మాటలమీద, శాస్త్రం మీద గౌరవం లేదు. గురువు యొక్క దయ ఎలాగ ఉంటుంది? అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. గురువు యొక్క దయ మాటలకు అందదు, అందనప్పుడు గురువు కూడా ఎలా చెప్పగలడు!! అందుకే దక్షిణామూర్తి మౌనం వహించాడు. చనిపోవటం, మరల కొత్త శరీరం రావటం ఇవి అన్నీ కూడా అజ్ఞానంలో భాగమే. ఈ అజ్ఞానం అనే నిద్ర నుండి మేల్కొని జ్ఞానోదయం కలగటం ఒక్క గురువు కృపవలననే సాధ్యం. మనం సాధన చెయ్యగా చెయ్యగా, గురువును స్మరించగా స్మరించగా, ఈశ్వరుని ధ్యానించగా ధ్యానించగా మనం పరిశుద్ధులమవుతాము. భగవాన్ మాటలు మనం చదువుతున్నాము అనుకోండి, ఆ మాటలు మనకు అర్థం కాకపోతే, వాటిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి కాని ఆ మాటలు అసత్యం అని అనుకోకూడదు. ఆ మాటలు ఒక వ్యక్తి చెప్పినవికావు, ఒక జీవుడు ఆ మాటలు చెప్పటం లేదు, అవి చైతన్యంలో నుండి వస్తున్నాయి.

మనం సైన్సు, లెక్కలు, మెడిసిన్ ఇలా అందరూ అన్నీ నేర్చుకొంటున్నారు కాని మనకు చేతకానిది ఏమిటి? మనం ఎలా జీవించాలో నేర్చుకోవటం లేదు. అది కూడా నేర్చుకొంటే మనకు జ్ఞానం వచ్చేస్తుంది అంతకంటే ఏమీలేదు. గురువు మీరు చెప్పే మాటలను వింటాడు, మీ కష్టసుఖాలను వింటాడు, ప్రారబ్ధం నిన్ను కొట్టే మొట్టికాయల గురించి వింటాడు, అలాగా అమ్మా, నీకు ఇంతకష్టం వచ్చిందా అమ్మా! అని నీతో ఆప్యాయంగా మాట్లాడుతూ, నిన్ను దగ్గరకు తీసుకొని, నీకు తెలియకుండానే ఆయనలో ఐక్యం చేసుకొంటాడు, వాడు గురువు. ఆయన మనలను కాలాన్ని దాటిస్తాడు, దూరాన్ని దాటిస్తాడు, కర్తృత్వబుద్ధిని దాటిస్తాడు, మనలను ఎక్కడకు తీసుకొని వెళ్ళాలో అక్కడకు తీసుకొని వెళ్ళి విడిచిపెడతాడు, వాడు గురువు. గురువుకు భూత, భవిష్యత్, వర్తమాన కాలాలు లేవు, వీటిని కూడా దాటించి మనలను తీసుకొనిపోతాడు, వాడు గురువు. గురువు ఒకడి వంక దయగా చూస్తాడు, ఒకడి వంక కోపంగా చూడవచ్చు, అక్కడవాడు బాడుపడటానికి దయ అవసరం, ఇక్కడ వీడు బాగుపడటానికి కోపం అవసరం, వారు బాగుపడటం తప్పించి ఆయనకు ఏమీ అక్కరలేదు. సహృదయం, సద్బుద్ధి ఉండాలిగాని వాడు ఏమతస్థుడైనా, ఏకులస్థుడైనా వాడు పండితుడు అయినా, పామరుడు అయినా అందరూ కూడా లోపల ఉన్న దయకు పాత్రులే అనేవారు భగవాన్, అక్కడ సహృదయం ముఖ్యం. మనకు రూపం, నామం తప్పించి ఇంకొకటి తెలియదు. ఈ రూపబుద్ధి, నామబుద్ధిని దాటివెళ్ళగలమా అని మనకు అనిపిస్తుంది. అసలు వాటిలో ఉన్న అల్పత్వాన్ని, నిస్సారతను ముందు మన బుద్ధికి అర్థమయ్యేటట్లు చేస్తాడు. కావేరి నది పుట్టిన చోటుని 'మేకదాటు' అంటారు అంటే మేకలు కూడా చాలా తేలికగా దాటి వెళ్ళిపోతాయి. అలాగే అజ్ఞానంలోనుండి, ఈ మాయలోనుండి మేకదాటుకింద నిన్ను దాటించి తీసుకొనిపోతాడు, వాడు గురువు. ముందు అవగాహన చేసుకొనేబుద్ధిని ఇస్తాడు, తరువాత వాటిని ఓవర్‌కమ్ చేసే శక్తిని ఇస్తాడు. ఆయన మాత్రం నిర్మలంగా, నిశ్చలంగా పనిచేసు కొంటూ పోతాడు, వాడు గురువు. ఒక బ్రాహ్మణుడు భగవాన్ దగ్గరకు వచ్చి అన్ని కులాల కంటే బ్రాహ్మణ కులం అగ్రకులం కదా అని అడిగాడు. భగవాన్ ఏమి అన్నారు అంటే నీవు రోజూ నిద్రపోతున్నావా? అని అడిగారు. నిద్రపోతున్నాను అని చెప్పాడు. నిద్రపోయినప్పుడు నేను బ్రాహ్మణుడిని అని నీవు అనుకొంటున్నావా? అని అడిగారు. నిద్రపోయినప్పుడు ఏమీ అనుకోవటం లేదు అని చెప్పాడు. భగవాన్ ఏమి చెప్పారు అంటే అక్కడ మిధ్యానేను లేదు

అందుచేత అక్కడ ఏ గొడవలు లేవు, మిథ్యానేను వచ్చిన తరువాతే సమస్యలు అన్నీ వస్తాయి. అది నీవు కానప్పుడు, అది కల్పించిన విషయాలు నీకు ఎందుకు? అవి పట్టుకొని ఎంతకాలం తిరుగుతావు అన్నారు. మనకాళ్ళు, చేతులు పనిచేస్తున్నప్పటికీ మనస్సు సన్యాసంలో ఉండాలి. కొంతమంది సన్యాసం తీసుకొని గృహస్థులులాగ ఉంటారు. సన్యాసం అనేది మానసికస్థితి. మనం జిన్నూరులో ఎలా ఉన్నామో, హైదరాబాదులో ఎలా ఉన్నామో, కాశీలో ఎలా ఉన్నామో, అరుణాచలంలో కూడా అలాగే ఉంటే వాడు సన్యాసి. నిజమైన సన్యాసం అంటే వాడు ఏకాలంలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా, ఏ ఉపాధిలో ఉన్నా, ఎక్కడ ఉన్నా వాడి మనస్సు సమానంగా ఉంటే వాడు నిజమైన సన్యాసి. హైదరాబాద్ నుండి అమెరికా వెళ్ళిన వెంటనే మనం బెంగపెట్టుకొంటాము ఎందుకు? మనస్సుకు సన్యాసం లేదు. కొంతమందికి చుట్టాల ఇంటికి వెళితే ఆ రోజు నిద్రపట్టదు అంటే వాడు సన్యాసి కాదు అని అర్థం. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఎవడి మనస్సు అయితే సమానంగా ఉంటుందో వాడు సన్యాసి. కర్మఫలకాంక్ష లేనివాడు సన్యాసి అని గీతలో పరమాత్మ చెప్పాడు. కృష్ణుడు గృహస్థాశ్రమంలో ఉన్నాడు, ఆయన కంటే పెద్ద సన్యాసి ఎవరు ఉన్నారు? మనం గృహస్థాశ్రమంలో ఉన్నా మన బుద్ధి సన్యాసమైతే మనకు సుఖంగా రోజులు వెళ్ళిపోతాయి. టెన్షన్ ఏమీ ఉండదు. సన్యాసజీవితం వలన శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం బాగుపడుతుంది, ఇవి రెండూ బాగుంటే ఆధ్యాత్మిక అభివృద్ధికి అవి సహకరిస్తాయి. మనం సన్యాసబుద్ధిని అలవర్చుకొంటే పరిస్థితులు ఎలా ఉన్నా సంతోషంగా ఉండవచ్చు. ఆత్మజ్ఞానం రావాలంటే జీవితం పవిత్రంగా ఉండాలి కదా! పవిత్రుడు కానివాడు ఆత్మజ్ఞానానికి అర్హుడు ఎలా అవుతాడు? అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. అసలు నీకు నేను ఎవడను? అనే ప్రశ్నలోనే పవిత్రత వచ్చేస్తుంది, మూలతలంపును దాని మూలంలోనికి పంపే ప్రయత్నంలోనే ఆ అన్వేషణలోనే నీకు తెలియకుండానే పవిత్రత వచ్చేస్తుంది, పవిత్రత వచ్చి నిన్ను వరిస్తుంది వయ్యా అంటున్నారు భగవాన్. మీరు సుఖపడాలంటే సన్యాసబుద్ధిని అలవర్చుకోండి. మీకు సన్యాసబుద్ధి ఉంటే పని అయిపోతుంది, టెన్షన్ ఉండదు. సన్యాసబుద్ధి ఉన్నవాడు జయం వచ్చినప్పుడు పొంగిపోడు, అపజయం వచ్చినప్పుడు కృంగిపోడు, అలా మనం ఉండగలిగితే మనకు సన్యాసబుద్ధి ఉందని అర్థం. అలా ఉండటం నేర్చుకోమని చెపుతున్నారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 23-08-05 | మంగళ | పాలకొల్లు యడ్లబజార్‌లో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంనందు మధ్యాహ్నం గం॥ 3-00లకు |
| 26-08-05 | శుక్ర | భీమవరం తాడిమళ్ళ వారి కేంద్రం - శ్రీరామపురం |
| 30-08-05 | మంగళ | ఒడ్డూరు |
| 04-09-05 | ఆది | యానాం శారదా కాన్వెంట్ ఆవరణలో |
| 23-09-05 | శుక్ర | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## పాఠకులకు మనవి

సెప్టెంబరు 2005 నుండి రమణభాస్కర పక్షపత్రిక "మాసపత్రిక"గా మారుచున్నది. సంవత్సర చందా రు॥ 100/-లు మాత్రమే. ఈ మార్పును గమనించగలరు. చందాదారులు ఈ క్రింది కూపన్‌ను పూర్తిచేసి పంపించగలరు.

పేరు : ..........................................................................

తండ్రి/భర్త/సంరక్షకుడు : ..........................................................

డోర్ నెం. : ......................................................................

వీధి : ............................................................................

ఊరు : ...........................................................................

పిన్ కోడ్ : ........................................ జిల్లా ......................................

డి.డి./యం.ఓ. నెం. : ..........................................................

కూపన్ పంపవలసిన చిరునామా :

బి. మల్లిఖార్జునరావు

శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు - 534 265, పోడూరు మండలం, ప॥గో॥ జిల్లా, ఆం.ప్ర., 9247104551

# ఆలోచన మీదే అహంవృత్తి ఆధారపడి ఉంది

ఆలోచన అనగా "స్మృతి". అంటే గత అనుభవాన్ని ఆధారంచేసుకొని వర్తమానంలో ఉండటం. మన ఆలోచనలు, విలాసంతో, భయంతో మరోదానితో కొట్టుమిట్లాడుతుంది. సాధారణంగా అందులో కొత్తది చేరదు "అవసరం వచ్చినప్పడు ఆలోచనలు వాడుకోవటం. అవసరం లేనప్పడు విడవటం నేర్చుకోవాలి. ఎప్పడు సాంప్రదాయబద్ధంగా ఆలోచిస్తే కొత్తదనం లేదు అసలు ఆలోచనల లేనప్పడు పవిత్రంగా ఉంటాము. పవిత్రతను ఇతరులకు తెల్పటానికి కూడా ఆలోచన కావాలి అందుచేత ఆలోచనలు లేనప్పడు కలిగే పవిత్రతను మాటలలో అందజేయలేము" అంటారు పెద్దలు. గతకాలాన్ని స్మరిస్తూ జీవించేవారికి అంతర్ దృష్టి ఉండదు. జ్ఞాపకాలు, ఊహలు అన్నీ గతానివే వాటితోనే ఉంటే ఘర్షణ తప్పదు. గత జీవితంలోనే ఉంటే అదే వర్తమాన మౌతుంది. అదే మరలా భావిజీవితమౌతుంది. ఈ విషయంలో సరియైన దృష్టి సారిస్తే జీవితంలో సామరస్యం చేకూరుతుంది. మనలో చాలామంది చెడును మూటకట్టు కొంటారు. దాని వల్లనే దుఃఖం ఎక్కువ అవుతుంది. దాన్ని భక్తితో శుభ్రం చేసుకోవాలి. ఎంతో సంతోషకరమైన స్పందన జరిగితే ఇంకా కావాలి, ఇంకా కావాలి అని, బాధాకరమైన స్పందన కలిగితే, ఇది వద్దు ఇది వద్దు అంటాము. ఈ విధానం మారాలి. లేకపోతే అది విశ్రాంతి లేకుండా ప్రతిస్పందిస్తూ ఉంటే అదే తన అలవాటుకు తాను బానిస అవుతుంది. ఈ విష వలయం నుంచి బయటపడేవరకూ దుఃఖం నుండి బయటపడలేము. శ్రీ నాన్నగారు "ఆలోచనలో ఏముంది అనుకోకండి మన జీవితానికి అవే మార్గదర్శకత్వం వహిస్తూ నడుపుతున్నాయి. ఒక బల్లమీద కొన్ని వస్తువులు ఉన్నాయి అనుకోండి, ఆ బల్లను లాగేస్తే ఆ బల్లకు ఆధారంగా ఉన్న వస్తువులు క్రింద పడిపోతాయి, అలాగే ఆలోచనలకు ఆధారంగా ఉన్న నేను అనే మూలతలంపును విడిచిపెడితే ఆత్మగా మిగిలుతాము. అలా చెయ్యలేనప్పడు భగవంతుణ్ణి శరణాగతి చెందాలి" అన్నారు. మనం కాలక్షేపం కోసం బఠానీలు తిన్నట్లు, ప్రకృతి ఆలోచనలతోనే ఉండకూడదు. మనస్సు శు భ్రమయ్యే వరకూ స్వేచ్ఛ లేదు, స్వేచ్ఛలేకపోతే సుఖం లేదు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**